పల్లకిపై కామాక్షితాయి వైభవం



బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని జొన్నవాడలో వెలసిన మల్లికార్జున సమేత కామాక్షితాయి దేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం స్వామి, అమ్మవార్ల తిరుచా ఉత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్లను పల్లకిపై ఉంచి ఆలయం చుట్టూ ఊరేగించారు. కార్యక్రమంలో పారిశ్రామికవేత్త బడికాల శంకర్ రఘునాథ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.
– బుచ్చిరెడ్డిపాళెం రూరల్

పార్కు నిర్వహణ గాలికి..



పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్‌లో నిర్మించిన పార్కు అడవిని తలపిస్తోంది. గతంలో ఇక్కడ ఆహ్లాదకర పరిస్థితులుండేవి. సాయంత్రం వేళల్లో కుటుంబాలు వచ్చి సేదతీరేవి. కొంతకాలంగా పార్కును పట్టించుకోకపోవడంతో ముళ్లకంపలతో నిండిపోయి అడవిలా తయారైంది. లేఅవుట్ నిర్మాణం సమయంలో దీనిని నిర్మించారు. తర్వాత పార్కు నిర్వహణను పంచాయతీకి అప్పగించారు. స్వచ్ఛంద సంస్థల వారు, గ్రామపెద్దలు కొద్దిరోజులు నిర్వహణ బాధ్యతలు తీసుకున్నారు. ప్రస్తుతం అధ్వాన స్థితిలో ఉంది. – పొదలకూరు

దెబ్బతింటున్న రోడ్డు

సంగం – పొదలకూరు మార్గం మహ్మదాపురం గిరిజన కాలనీ వద్ద మెయిన్‌రోడ్డు దెబ్బతింది. నెల్లూరుకు తాగునీటిని సరఫరా చేసే ప్లాంట్ ఇక్కడి కొండపై నిర్మించారు. వ్యర్థ జలాలు లీకై రోడ్డుపై చేరుతుండటంతో దెబ్బతింటున్నట్టు స్థానికులు వెల్లడించారు. గతేడాదే సంగం – పొదలకూరు రహదారికి మరమ్మతులు చేపట్టారు. కాలనీకి సమీపంలోనే సుమారు 50 మీటర్ల రోడ్డు పనికి రాకుండాపోయింది. రిపేర్లు చేపట్టినా తిరిగి దెబ్బతినే అవకాశం ఉంది. నీటిని రోడ్డుపైకి రాకుండా చేస్తే రిపేర్లు చేపట్టేందుకు అవకాశం ఉంటుంది. – పొదలకూరు



క్లుప్తంగా

బాబా మందిరంలో విశేష పూజలు



పొదలకూరు: పట్టణంలోని షిర్డీ సాయిబాబా మందిరంలో గురువారం విశేష పూజలను నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. రాత్రి స్వామికి పల్లకి సేవ జరిగింది. శేజ్ హారతితో పూజా కార్యక్రమాలు ముగిశాయి.

ఆర్డీఓ పరిశీలన



జగనన్న లేఅవుట్‌లో పరిశీలిస్తున్న ఆర్డీఓ వంశీకృష్ణ

కొడవలూరు: కొడవలూరులోని జగనన్న లేఅవుట్, శివాలయం వెనుకనున్న లేఅవుట్‌లను కావలి ఆర్డీఓ వంశీకృష్ణ గురువారం పరిశీలించారు. ప్రభుత్వ లేఅవుట్లలో అర్హులే ఉన్నారా.. అనే సర్వే ప్రస్తుతం జరుగుతోంది. దీనిపై హౌసింగ్ అధికారులతో ఆర్డీఓ మాట్లాడారు. సర్వేపై ఆరా తీశారు. లేఅవుట్‌లలో ఖాళీ ప్లాట్లు ఉన్నాయా.. ఉంటే ఎందుకున్నాయి అని అడిగి తెలుసుకున్నారు. నిర్మాణాలు నిలిపి వేయడానికి గల కారణాలపై ఆరాతీశారు. సర్వే పారదర్శకంగా, వేగంగా పూర్తి చేయాలని హౌసింగ్ అధికారులను ఆదేశించారు. ఆయన వెంట తహసీల్దార్ కె.స్ఫూర్తిరెడ్డి, హౌసింగ్ ఏఈ ముక్తార్‌బాషా, ఆర్‌ఐ సునీల్‌రెడ్డి, వీఆర్వో శ్రీనివాసులు, హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ బాలసుబ్రహ్మణ్యం ఉన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

కోవూరు: మండలంలోని ఇనమడుగు, వేగూరు సబ్‌స్టేషన్ల పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని డీఈఈ మధుసూదన్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇనమడుగు సబ్‌స్టేషన్ పరిధిలోని ఇనమడుగు, చెర్లోపాళెం, లేగుంటపాడు పరిధిలో ఉదయం 8 నుంచి 9 గంటల వరకు, వేగూరు సబ్‌స్టేషన్ పరిధిలో వేగూరు, మోడేగుంట, వడ్డిపాళెం తదితర గ్రామాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

నిత్యాన్నదానానికి విరాళం



రాపూరు: జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో ఉన్న పెనుశిల లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి వైఎస్సార్ జిల్లా మాధవరానికి చెందిన రాజు ప్రభాకర్‌రెడ్డి, రెడ్డెమ్మలు రూ.2,05,121 విరాళంగా అందించినట్లు ఏసీ శ్రీనివాసులురెడ్డి గురువారం తెలిపారు. దాతకు తీర్థ, ప్రసాదాలు అందించినట్లు ఆయన వెల్లడించారు.

పార్కుల్లో ఉచిత యోగా శిబిరాలు

నెల్లూరు(బారకాసు): అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా మే 21 నుంచి జూన్ 21వ తేదీ వరకు యోగాంధ్ర–2025 కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నగరపాలక కమిషనర్ నందన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ క్రమంలో నగరపాలక సంస్థ పరిధిలోని పలు పార్కుల్లో ఉచిత యోగా శిబిరాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. నగరంలోని చిల్డ్రన్స్ పార్కు, పీపుల్స్ పార్కు, ఎన్టీఆర్ పార్కు(అనిల్ గార్డెన్స్), ఎంఎస్సార్ పార్కు, నుడా పార్కు(అన్నమయ్య సర్కిల్), పప్పులవీధి పార్కు, ఏసీనగర్ ఎంఎస్‌ఎం పార్కు, ఆదిత్య నగర్ పార్కు, మహబూబ్‌ఖాన్ పార్కు, స్వాతంత్ర పార్కు, బ్యాంకు కాలనీ పార్కులలో ప్రతిరోజూ ఉదయం 6 నుంచి 7 వరకు, సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు యోగా గురువుల సహకారంతో ఉచిత శిబిరాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

సాగునీటి పారుదలకు దారేదీ?

- కాలువల్లో గుర్రపుడెక్క
- ఆందోళన వ్యక్తం చేస్తున్న రైతులు



గుర్రపుడెక్కతో నిండిపోయిన కోవూరు కాలువ

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండలంలోని ప్రధాన కాలువలు గుర్రపుడెక్కతో నిండిపోవడంతో సాగునీటి పారుదలకు దారేది అని రైతులు ప్రశ్నిస్తున్నారు. ముఖ్యంగా కనిగిరి రిజర్వాయర్ నుంచి మొదలయ్యే ఈస్టర్న్, నదరన్ కాలువల ద్వారా కోవూరు, కొడవలూరు, బుచ్చిరెడ్డిపాళెం మండలాలకు సాగునీరు అందుతోంది. ఈ కాలువలు పూర్తిగా గుర్రపుడెక్కతో నిండిపోవడంతో రిజర్వాయర్ నుంచి నీరు విడుదల చేసినా.. ముందుకు సాగే పరిస్థితి లేదు. దీంతో రైతులు సాగునీటి కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

దయనీయంగా..

ప్రధాన కాలువల పరిస్థితి ఇలా ఉంటే చిన్నచిన్న కాలువలు మరింత దయనీయంగా మారింది. కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి రెండోపంటకు సాగునీరు విడుదల చేశామని గొప్పలు చెప్పుకుంటున్నా.. క్షేత్రస్థాయిలో పొలాలకు నీరందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. నియోజకవర్గంలోని ప్రతి మండలంలో అన్ని కాలువల్లో తమ సొంత నిధులు, ట్రస్ట్ ద్వారా పూడిక తీశామని వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి చెబుతున్నారు. పనులు చేయకుండానే వాటికి సంబంధించి ఆయా మండల టీడీపీ నాయకులు ప్రభుత్వం ద్వారా బిల్లులు పొందారనే ఆరోపణలు ఉన్నాయి. పనులు మాత్రం జరగలేదు. ఇదే విషయాన్ని ఇటీవల బుచ్చిరెడ్డిపాళెం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో మాజీ డీసీఎంఎస్ చైర్మన్ వీరి చలపతిరావు సమాచార హక్కు చట్టం ద్వారా సేకరించిన ఆధారాలతో ప్రభుత్వ నిధులు ఎలా దోచుకున్నారో వివరించారు. అయినా ప్రభుత్వం నుంచి ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

బుచ్చిరెడ్డిపాళెం మండలంలో..

మండలంలో సాగునీటి కాలువల దుస్థితి అధ్వానంగా ఉంది. ముఖ్యంగా కోవూరు కాలువ, పెనుబల్లి కాలువల్లో గుర్రపుడెక్క తప్ప ఇంకేం కనిపించడం లేదు. స్థానిక టీడీపీ నాయకులు రైతుల సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లడంలో తీవ్రంగా విఫలమయ్యారు. ఇసుక, మట్టి, గ్రావెల్ తరలించడంలో బిజీగా ఉన్నారే తప్ప రైతులు, ప్రజల సమస్యలు పరిష్కరించడంలో ఏమాత్రం చొరవ చూపడం లేదని మండల ప్రజలు అంటున్నారు.



దుస్థితిలో మలిదేవి కాలువ



పెనుబల్లి సాగునీటి కాలువ పరిస్థితి ఇలా..

గ్రామాల్లో హనుమజ్జయంతి వేడుకలు



కొడవలూరు: నార్తురాజుపాళెంలో..



పొదలకూరు: ప్రభగిరిపట్నం దేవస్థానంలో..

పొదలకూరు: పట్టణంలోని మారుతీనగర్‌లో శతాబ్దాల నాటి శ్రీవీరాంజనేయస్వామి దేవస్థానంలో గురువారం హనుమజ్జయంతి వేడుకలను వైభవంగా నిర్వహించారు. ప్రత్యేకపూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నప్రసాదం అందజేశారు. రాత్రి శ్రీరామాంజనేయ యుద్ధ నాటకాన్ని ప్రదర్శించారు. మొగళ్లూరు, కల్యాణపురంలో ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు అన్నదానం చేశారు. ఇంకా తాటిపర్తి, ప్రభగిరిపట్నం, కనుపర్తి, మహ్మదాపురం, కొత్తకంభాలపల్లి, ఆర్‌వై పాళెం, సూరాయపాళెం, శాంతినగర్ తదితర గ్రామాల్లో అభయాంజనేయస్వామికి ప్రత్యేక పూజలను నిర్వహించారు.

- మండలంలోని ప్రభగిరిపట్నం అభయాంజనేయస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిగాయి. సాయంత్రం పూలంగిసేవ, పల్లకి సేవ నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం జరిగింది.
- **మనుబోలు:** మండలంలోని పలు గ్రామాల్లో హనుమజ్జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. మనుబోలులో ఆంజనేయస్వామి గ్రామోత్సవాన్ని గురువారం రాత్రి వైభవంగా నిర్వహించారు. ముందుగా అర్చకులు హనుమాచార్యులు అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. హనుమంతుని పల్లకి సేవను ఘనంగా నిర్వహించారు. అనంతరం ఐరావతం వాహనంపై ఉంచి హనుమంతుడిని ప్రత్యేకంగా అలంకరించి ట్రాక్టర్‌పై గ్రామోత్సవం చేశారు. అంతకుముందు ఆలయం వద్ద ప్రదర్శించిన కోలాటం భక్తులను ఆకట్టుకుంది. అలాగే కట్టువపల్లి, యాచవరం, చెర్లోపల్లి గ్రామాల్లో కూడా హనుమజ్జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.
- **ఇందుకూరుపేట:** హనుమాన్ జయంతి పర్వదినాన్ని మండలంలోని పల్లిపాడు, మైపాడు, ఇందుకూరుపేట, కొత్తూరు, గంగపట్నం తదితర గ్రామాల్లో గురువారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి అభిషేకాలు, విశేష పూజలు జరిగాయి. పల్లిపాడులోని వెంకటేశ్వర స్వామి ఆలయ ఆవరణలోని ఆంజనేయస్వామికి 108 లీటర్ల పాలతో అభిషేకం, వడమాల, సహస్రనామ సిందూర అర్చన, సహస్రనామ తదితర పూజలు జరిపారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరిగింది. దీంతో గ్రామాల్లో కోలాహలం నెలకొంది.
- **విడవలూరు:** మండలంలోని దంపూరు గ్రామంలో కొలువైన అభయాంజనేయస్వామి దేవస్థానంలో హనుమాన్ జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక సర్పంచ్ ఇనగంటి సురేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో విశేష పూజలు జరిగాయి. అర్చకుడు చంద్రమౌళి ప్రసాద్‌శర్మ స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి పంచామృతాన్ని నైవేద్యంగా సమర్పించారు. భానుప్రకాష్, శివరామిరెడ్డి, చిరంజీవి, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.
- **బుచ్చిరెడ్డిపాళెం రూరల్:** హనుమజ్జయంతి సందర్భంగా నగర పంచాయతీ పరిధిలో గురువారం హిందూచైతన్య వేదిక ఆధ్వర్యంలో శోభాయాత్ర నిర్వహించారు. పట్టణంలోని డీఎల్ఎన్నార్ పాఠశాల నుంచి కోదండరామాలయం వరకు జరిగిన యాత్రలో యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, బీజేపీ, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.
- **కొడవలూరు:** మండలంలోని నార్తురాజుపాళెంలో హనుమాన్ శోభాయాత్ర గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయం వద్ద నుంచి హైస్కూల్ మీదుగా హైవేలోని అభయాంజనేయస్వామి ఆలయం వద్దకు బైక్ ర్యాలీ చేరుకుంది. అనంతరం ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొడవలూరు సీఐ ఎ.సురేంద్రబాబు సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు. పేట మధు, చేవూరు వేణు యాదవ్‌ల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మోపూరు కోదండరామిరెడ్డి, అర్చకుడు కృష్ణమాచార్యులు పాల్గొన్నారు.



పొదలకూరు : మారుతీనగర్ వీరాంజనేయస్వామి



మనుబోలులో పల్లకి సేవ



విడవలూరు: దంపూరులో..



ఇందుకూరుపేట : పల్లిపాడులో..

వైభవంగా కల్యాణోత్సవం



స్వామి, అమ్మవార్ల కల్యాణం జరిపిస్తున్న వేదపండితులు



గజవాహనంపై ఊరేగింపు

పొదలకూరు: పట్టణంలోని శ్రీలక్ష్మి గోదా సమేత వెంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఉభయకర్తలుగా పెంద్యాల రమణయ్యనాయుడు – విజయలక్ష్మి దంపతులు వ్యవహరించారు. ఉదయం గజవాహనంపై స్వామి, అమ్మవార్లు భక్తులకు దర్శనం ఇచ్చారు. ఉభయకర్తలుగా జి.అశోక్, సునీత, పి.సుబ్బానాయుడు పద్మజ వ్యవహరించారు. మధ్యాహ్నం స్వామి హంస వాహనంపై ఊరేగారు. సాయంత్రం గరుడ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా పలువురు వ్యవహరించారు. భక్తులకు అన్నప్రసాదాలు అందజేశారు. కార్యక్రమాలను పాలక మండలి బాధ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఆంగ్లంలో ప్రావీణ్యం అవసరం



కొడవలూరు: యల్లాయపాళెంలో..



కొడవలూరులో..

కొడవలూరు: ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతిఒక్కరికీ ఆంగ్లంలో ప్రావీణ్యం అవసరమని ఉపాధ్యాయుడు వై.మునీంద్ర సూచించారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా యల్లాయపాళెం గ్రంథాలయంలో ఆంగ్ల భాషలో రాయడం, చదవడంపై విద్యార్థులకు గురువారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మాతృభాష తెలుగుతో పాటు ఆంగ్లంపై ప్రతి విద్యార్థి దృష్టి సారించాలన్నారు. తద్వారానే మెరుగైన ఉపాధి అవకాశాలు పొందవచ్చన్నారు. లైబ్రేరియన్ జె.సురేంద్రరెడ్డి, రిటైర్డ్ వీఆర్వో కె.రఘునందన్‌రెడ్డి పాల్గొన్నారు.

- వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా కొడవలూరు గ్రంథాలయంలో విద్యార్థులకు గురువారం చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. అంతర్జాతీయ జీవవైవిధ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులతో జీవజాతి పరిరక్షణపై అవగాహన కల్పించారు. లైబ్రేరియన్ కె.రాజేశ్వరి పాల్గొన్నారు.

కొత్త రేషన్‌కార్డుల కోసం తప్పని తిప్పలు

- హౌస్ మ్యాపింగ్ కీలకం
- దాని ఆధారంగానే దరఖాస్తుల స్వీకరణ
- కొత్త దంపతులకు మ్యారేజ్ సర్టిఫికెట్ తప్పనిసరి
- బయోమెట్రిక్స్ పడితేనే దరఖాస్తు ఆన్‌లైన్
- మొరాయిస్తున్న సర్వర్
- సచివాలయాల చుట్టూ దరఖాస్తుదారుల ప్రదక్షిణలు



దుత్తలూరు సచివాలయంలో రేషన్‌కార్డు దరఖాస్తునకు వేచి ఉన్న ప్రజలు

దుత్తలూరు: కొత్తరేషన్ కార్డుల మంజూరుకు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించడంతో అర్హులైన వారిలో నెలకొన్న ఆనందం కాస్తా ఆన్‌లైన్ కష్టాలతో ఆవిరైపోతోంది. రేషన్‌కార్డు దరఖాస్తునకు పెట్టిన నిబంధనలతో ప్రజలు సచివాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. కుటుంబ సభ్యుల మ్యాపింగ్ ఒకే చోట జరగకుంటే వారి దరఖాస్తులు ఆన్‌లైన్ కావట్లేదు. కొత్తదంపతులకు మ్యారేజ్ సర్టిఫికెట్ తప్పనిసరి చేయడంతో అది ఎలా తెచ్చుకోవాలో తెలియక సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ఈ సర్టిఫికెట్ కోసం ఎప్పుడో పెళ్లి చేసుకున్న వాళ్లు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు వెళితే రూ.3 వేల నుంచి రూ.5వేలు ఖర్చు అవుతుండడంతో లబోదిబోమని వాపోతున్నారు. రేషన్ కార్డుల్లో పిల్లల చేర్పు, తొలగింపులో కూడా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మరోవైపు బయోమెట్రిక్ పడకుంటే దరఖాస్తు ఆన్‌లైన్ కావడం లేదు. దీంతో బయోమెట్రిక్ పడకపోతే పరిస్థితి ఏమిటని కొందరు ప్రశ్నిస్తున్నారు. అర్హులైన వారి నుంచి దరఖాస్తులు తీసుకునే విధానంలో కొన్ని నిబంధనలను సడలించాలని ప్రజలు కోరుతున్నారు.

నిబంధనలిలా..

కూటమి ప్రభుత్వం నూతన రేషన్‌కార్డుల జారీ, విభజన, కొత్తగా కుటుంబ సభ్యుల చేర్పులు, తొలగింపులు, చిరునామా మార్పులకు దరఖాస్తుల స్వీకరణతో పాటు ఇప్పటికే రైస్‌కార్డులు కలిగి ఉన్న వారికి వాటిని ప్రభుత్వానికి సరెండర్ చేసే అవకాశాన్ని కల్పించింది. జిల్లా వ్యాప్తంగా అన్ని వార్డు, గ్రామ సచివాలయాల్లో కొన్ని రోజులుగా దరఖాస్తుల స్వీకరణ జరుగుతోంది. దరఖాస్తులను ఆన్‌లైన్ చేసే ప్రక్రియలో విధించిన నిబంధనలు ఇప్పుడు కొత్త కష్టాలు తెచ్చిపెట్టాయి. అన్ని సరిచూసుకుని అప్‌లోడ్ చేసే సమయానికి సర్వర్లు పనిచేయడం లేదు. దీంతో మూడు, నాలుగుసార్లు సచివాలయాలకు వెళ్లాల్సి వస్తోంది. కార్డుల దరఖాస్తునకు ఇన్ని నిబంధనలు ఉంటే ఎలాగని పలువురు వాపోతున్నారు.

మ్యాపింగ్‌తో తీవ్ర ఇబ్బంది

రేషన్‌కార్డుకు వివాహమై పిల్లలు ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలంటే భార్యాభర్తలు, పిల్లలు ఒకేచోట ఉన్నట్లు హౌస్ మ్యాపింగ్ ఉండాలి. తల్లిదండ్రులు, వారి పిల్లలు ఒకే కుటుంబం అయినప్పటికీ మ్యాపింగ్‌లో ఒకేచోట లేకపోతే దరఖాస్తు స్వీకరణ సమయంలో ఆన్‌లైన్ కావడం లేదు. గతంలో చేసిన తప్పిదాలు ఇప్పుడు రేషన్‌కార్డు దరఖాస్తుదారులకు శాపంగా మారాయి. మ్యాపింగ్‌లో మార్పులు, చేర్పులు, ఎడిట్ చేసే అవకాశాన్ని ఇవ్వకపోవడం పెద్ద సమస్యగా మారింది. ఈ సమస్యను పరిష్కరించకపోతే కొత్త రేషన్‌కార్డులు పొందే అవకాశాన్ని కోల్పోతారు.

బయోమెట్రిక్స్ పడకుంటే కార్డు రానట్టే..

రేషన్‌కార్డుల దరఖాస్తులను ఆన్‌లైన్ చేసే ప్రక్రియలో ప్రధాన దరఖాస్తుదారుడు తప్పనిసరిగా తన బయోమెట్రిక్స్ (వేలిముద్రలు) వేయాల్సి ఉంటుంది. అది పడకుంటే దరఖాస్తు ఆన్‌లైన్ కావడం లేదు. గతంలో ఆధార్‌కు లింకైన మొబైల్‌కు ఓటీపీ వచ్చేది. దీని వల్ల బయోమెట్రిక్స్ పడని వారికి ఉపయోగకరంగా ఉండేది. ఓటీపీ ఆప్షన్ డిజేబుల్ చేశారని చెబుతున్నారు.

విభజనలో కొత్త కష్టాలు

తల్లిదండ్రులతో కలిసి ఉన్న కొడుకులు, కుమార్తెలకు వివాహమై కొత్త కార్డు పొందేందుకు విభజన అవకాశాన్ని కల్పించిన ప్రభుత్వం దానిని ఒక్కరికే పరిమితం చేసింది. ఇద్దరు పిల్లలు ఉండి, వారికి వివాహమైతే అందులో ఒక్కరినే విభజించే అవకాశం ఉండడంతో రెండో వారు దరఖాస్తు చేసుకునే వీల్లేకుండా పోతోంది.

ఆధార్ చిరునామాతోనే..

ఆధార్ కార్డులో ఉన్న చిరునామానే దరఖాస్తు స్వీకరణ సమయంలో పరిగణనలోకి తీసుకుంటున్నారు. చిరునామా మార్పునకు అవకాశం ఇవ్వకపోవడంతో పాత చిరునామాలతోనే దరఖాస్తు చేస్తున్నారు. వివాహమైన తర్వాత ఆధార్ భార్య ఇంటి పేరు మారకున్నా, భార్యాభర్తల ఇంటి పేర్లు ఒకేలా లేకున్నా ఆన్‌లైన్లో తీసుకోవడం లేదు. చదువుకున్న వారు ఉద్యోగాల కోసం ఆధార్ ఇంటిపేరు మార్చుకోవడం లేదు. అటువంటి వారికి ఇబ్బంది ఎదురవుతోంది. చిన్నారుల బాల ఆధార్ అప్డేట్ అయితే కానీ వారి పేర్లను తల్లిదండ్రుల కార్డుల్లో చేర్చడానికి అవకాశం ఉండడం లేదు. ఇప్పుడు అప్‌డేట్ చేయించాలంటే కార్డుల దరఖాస్తు గడువు ముగిసిపోతుందని తల్లిదండ్రులు వాపోతున్నారు. దీనికి తోడు సచివాలయాల్లో సిబ్బంది కొరత వేధిస్తుండడంతో రోజుల తరబడి దరఖాస్తుదారులు ప్రదక్షణలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఒకవేళ సిబ్బంది ఉన్నా సర్వర్ మొరాయిస్తోంది. దీంతో లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దరఖాస్తునకు గడువు ఇవ్వాలని కోరుతున్నారు.